## 524 క్రైస్తవ యువజనులారా క్రీస్తు కొరకు నిలువండి

రా –బేహాగ్ తా–ఆది

భారత క్రైస్తవ – యువజనులారా – ప్రభుకై నిలువండీ – భారతరక్షక – భటవరులారా – ప్రభువును జూపుటకై లెండి – ఫలితము గనరండీ ॥భారత॥

1. బాలప్రాయమున మీరలెల్ల – భక్తి జీవితాసక్తిపరులై – అలయోసేపును బోలినవారై – బలతర సామర్థ్యము జూపి – ఫలితముగనరండీ ॥భారత॥
2. శోధనాధికము చుట్టునున్న – సకల యాశలును – నెట్టుచున్న – బాధించుచు మరి సాధించెడి యా – సైతానుని గెలువగ లెండి – ఫలితము గనరండీ ॥భారత॥
3. నమ్మకంబు మదియందు బూని – నేర్పుతోడ ప్రభు సేవజేయ – రమ్మిదె యేసుని రక్షణ సేవకు – రాజితమగు – జీవమునొందన్ – ఫలితము గనరండీ ॥భారత॥
4. విజయ కాంక్షగలవారలెల్ల – వినయ భూషణాసక్తిపరులై – నిజమగు క్రైస్తవ నీతిని జూపి – నిరతముగ వెలుగుదు రండీ – నిజమిది గనుగొనుడీ ॥భారత॥

– చెట్టి భానుమూర్తి

## 525 ధైర్యమునకుఁ బ్రేరేపణ

రా –యదుకులకాంభోజి (చాయ : యేసుని భజియింపవే మనసా) తా–ఆది

దానియేల్వలె సాహసించుడి – యొంటరిగా నిల్వ – దానియేల్వలె సాహసించుడి = దానియేల్వలె సాహసించుచు – జ్ఞానులై దృఢ కార్యముఁ గలిగి – దీనులై యా దృఢ కార్యం బిఁకఁ బూని తెల్పను సాహసించుడి ॥దానియేల్॥

1. నిక్కమగు కార్యమునందు నిలిచి – దైవాజ్ఞ లెలఁ గ్రక్కున గైకొను జనములగాంచి చక్కఁగ వారిని ఘనపర్చుచు – సంతతము నెనరుఁ పించుచు– మిక్కిలి దానియేల్సంఘమును – మెచ్చుచు నంగీకరించుఁడీ ॥దానియేల్॥
2. ధారుణిపైని నగరములలో – మరణించిరిగా కడు – శూరులనఁబడువా రనేకులు = వారు దానియేల్సంఘమును గని – కోరి యేకీభవించినమది – వారలే ప్రభుదేవుని భట పరి – వారమనఁబడి యుందురు నిజ మిఁక ॥దానియేల్॥
3. కాన నీ సువిశేషమను జెండ పైకెత్తుఁడీ సై – తానుని నెదిరించను రండి = దీనిని దీని శ్రేణులను యు – ద్ధానికి రారమ్మని పిలిచి – దానియేల్సంఘము పక్షమునఁ – బూని జయధ్వనులనుఁ జేయుటకై ॥దానియేల్॥

–బూదాల లైమన్



## 526 యేసువలె జీవించుట

రా –ముఖారి (చాయ : యేసు కరుణ) తా–అట

యేసువలెను – ఇల నేనుండెదను – యేసువలెను ॥

1. శుద్ధుడనై బ్రతుకు – బద్ధుడనంచును = శుద్ధుడనై యుండ – శ్రద్ధ జూపుదు నేను ॥యేసువలెను॥
2. భరియింపవలసిన భారంబుల్గల వెన్నొ = భరియింప మిక్కిలి బలశాలినై నేను ॥యేసువలెను॥
3. సాధింపవలెనెన్నొ – సాహసకార్యంబుల్ = సాధింపధైర్యాన – సాగి పోవుదు నేను ॥యేసువలెను॥
4. ధాత్రి నెల్లరతోడ – మైత్రినేనెరపుచు = శత్రులకునుగూడ – మిత్రు డనై నేను ॥యేసు వలెను॥
5. ఒరుల చింతలదీర్తు – నుల్లాసమున గూర్తు = పరమ ప్రేమతో నెపుడు – పైకి జూతును నేను ॥యేసువలెను॥
6. నా దివ్యజనకుడు – నాకు ననుదినమును = బోధింప వాక్యంబు బుద్ధితో నేర్తును ॥యేసువలెను॥
7. వినిసంతసంబున – ఘనుని యాజ్ఞలనెల్ల = వెనువెంట జేసెద – వినయంబున నేను ॥యేసువలెను॥

– పి.విజయ చార్లెస్